
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శనివారం 23 మార్చి 2024


శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0°C | కనిష్ఠం : 22.0°C



**రంజాన్ వేళలు**


ఇఫ్తార్ : శనివారం సా : 6.34 గం..
సహర్ : ఆదివారం ఉ : 4.55 గం..



ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ అక్రమాలు, వివాదాలకు కేరాఫ్‌గా మారిందా? యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు, నిధుల కేటాయింపులు జరుగుతున్నాయా? అడ్మిషన్లు మొదలు విద్యార్థుల ఆన్సర్ షీట్ల స్కానింగ్ టెండర్ల రద్దు వరకు అన్నీ అక్రమార్కుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయా? వీసీ, రిజిస్ట్రార్ నియామకంతో పాటు 16మంది అనుబంధ అధ్యాపకుల కొలువుల దాకా అన్నిటిలోనూ ఆరోపణలకు కేంద్రంగా విశ్వవిద్యాలయం మారిందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. యూనివర్సిటీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం దృష్టిసారించకపోవటంతో విద్యా ప్రమాణాలతో పాటు వర్సిటీ కీర్తిప్రతిష్టలు కూడా దెబ్బతింటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

# అక్రమాలకు కేరాఫ్ కేయూ!



**ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ**

- గాడి తప్పిన పాలనతో అంతా అస్తవ్యస్తం
- అనుబంధ అధ్యాపకుల నియామకం, ఆన్సర్‌షీట్ల స్కానింగ్ టెండర్లలో గోల్‌మాల్
- ఫార్మసీ కళాశాలలకు అనుమతుల్లోనూ నిబంధనలకు చెల్లుచీటీ
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విద్యార్థుల ఆందోళన
- సీడ్‌మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులతో నిధులు స్వాహా
- రిజిస్ట్రార్‌తో సహా అనేక నియామకాలపై వివాదం

# టర్నింగ్ టెర్రర్



పస్రా, ఒడ్డుగూడెం మార్గంలోని ప్రమాదకర మలుపు

- ప్రమాదకరంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు
- మలుపుల వద్ద సూచిక బోర్డులు కరువు
- నిత్యం వందలాది వాహనాల రాకపోకలు
- ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారుల నిర్లక్ష్యం

తాడ్వాయి, మార్చి 22: ఏజెన్సీ ప్రాంతంలోని రోడ్లు భయాందోళనలు కలిగిస్తున్నాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా నుంచి తాడ్వాయి మండలం లింగాల మీదుగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లే రహదారి మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి వెంట రాకపోకలు సాగిస్తుంటాయి. పస్రా నుంచి ఒడ్డుగూడెం, కొడిశాల, లింగాల, బోటిలింగాల, మామిడిగూడెం, దుబ్బగూడెం గ్రామాల మీదుగా గుండాలకు, అక్కడి నుంచి ఇల్లందు, కొత్తగూడెం, తదితర గ్రామాలతోపాటు పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు బీటీ రోడ్డు వేశారు. అయితే.. రహదారి వెంట సుమారు వందకుపైగా మలుపులు ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించలేని పరిస్థితి నెలకొంది. పస్రా నుంచి కొడిశాల వరకు తారురోడ్డు వేశారు, కొడిశాల నుంచి బోటిలింగాల వరకు గల రోడ్డును మేడారం మహాజాతరను పురస్కరించుకుని గుంతల్లో మట్టిపోసి పూడ్చారు. ఈరోడ్డు వెంట ఉన్న మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని లింగాల ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. జాతర సమయంలోనే కాకుండా ఇటీవల పలు భారీ వాహనాలు, ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురైన సంఘటనలూ ఉన్నాయి. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. గ్రామాల్లో పిల్లలు, వృద్ధులు రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పటికైనా మలుపుల వద్ద, గ్రామాలు, పాఠశాలల వద్ద ప్రమాద సూచిక బోర్డులు, హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేసే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బోటిలింగాల గ్రామంలో ప్రమాదకర మలుపు



పస్రా నుంచి ఒడ్డుగూడెం మార్గం

**సూచికబోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం**

- కోరం ముత్తయ్య, లింగాల మాజీ సర్పంచ్



పస్రా నుంచి లింగాల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై అధికారులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతిరోజూ ఈరోడ్డు వెంట వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులు, మలుపులు, ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

## బాలికపై అత్యాచార యత్నం

- భూపాలపల్లి సైబర్ క్రైం సీఐ సంపత్ అరెస్టు
- పోక్సో కేసులో రిమాండ్‌కు తరలింపు



సంపత్

వరంగల్ క్రైం, మార్చి22: బాలికపై అత్యాచార యత్నం చేసిన కేసులో భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం విభాగంలో సీఐగా పనిచేస్తున్న బండారు సంపత్ అరెస్టయ్యారు. ఈయనపై పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..

2012 బ్యాచ్‌కు చెందిన బండారు సంపత్.. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వర్ధన్నపేట, జఫర్‌గఢ్, కేయూ తదితర పోలీసుస్టేషన్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. కేయూ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా (ఆగస్టు 2021 నుంచి డిసెంబర్ 2022) పనిచేసిన సమయంలో సంపత్‌కు ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. సదరు మహిళ కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కాలనీలో నివాసం ఉంటోంది. సంపత్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు జరిగి భర్తకు దూరమైంది. ఆ తర్వాత ఇద్దరు సహజీవనం చేశారు. మొదటి భార్య వరంగల్ దేశాయిపేటలో ఉండగా.. ఈ మహిళ వద్దకు సంపత్ వస్తూ ఉండేవాడు.

దీంతో సదరు మహిళ భర్త నాటి సీపీ రంగనాథ్‌కు సంపత్‌పై ఫిర్యాదు చేయగా విచారణ చేసి వీఆర్‌కు అటాచ్ చేశారు. ఆపై సీఐగా పదోన్నతి పొందిన సంపత్.. ఖమ్మం, అటు నుంచి భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంకు మారారు. కాగా, మహిళ వద్దకు వస్తున్న సీఐ సంపత్.. ఆమె కూతురు (మైనర్)పై కన్నేశాడు. ఇటీవల ఆ బాలికపై అత్యాచార యత్నం చేశాడు. గమనించిన సదరు మహిళ.. సీఐ సంపత్‌పై ఇటీవల కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన కేయూ పోలీసులు.. అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సీఐ సంపత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయాన్ని కేయూ సీఐ సంజీవ్ ధ్రువీకరించారు. అరెస్టయిన సీఐ సంపత్‌పై సస్పెన్షన్ వేటు పడనుంది.



సూర్యకాంతిలో వెలిగిపోతున్న శివలింగం

## రామలింగేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు

వెంకటాపూర్ (రామప్ప), మార్చి 22 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని సుప్రసిద్ధ రామప్ప రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం ఉదయం అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. గర్భగుడి శివలింగాన్ని సూర్యకిరణాలు తాకాయి. అబ్బురపరిచే ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. రామలింగేశ్వరుడితో పాటు సూర్యభగవానుడి కృప కోసం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు. గర్భగుడికి సూర్యకిరణాలు తాకడం అతి అరుదైన విషయమని అర్చకులు ఉమాశంకర్ తెలిపారు. ఇది దైవ అనుగ్రహానికి ప్రతీక అన్నారు. ఈ వార్త విన్న పాలంపేట గ్రామస్థులు తండోపతండాలుగా తరలివచ్చి ఆలయాన్ని దర్శించుకున్నారు.

## మానుకోటలో ఏసీబీ కలకలం

- లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా
- స్థలం రిజిస్ట్రేషన్‌కు చదరపుగజానికి రూ.200 అదనంగా డిమాండ్
- గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- సబ్‌రిజిస్ట్రార్‌కు సహకరించిన డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా అదుపులోకి



మహబూబాబాద్‌లో తస్లీమా మహ్మద్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలో ఏసీబీ దాడులు కలకలం రేపాయి. బాధితుడిచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం కాపుకాసి.. జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆమెతో పాటు ఆమెకు సహకరించిన ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆలేటి వెంకట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన రైతు గుండగాని హరీష్ దంతాలపల్లి మండల కేంద్రంలో 128 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఈనెల మొదటి వారంలో సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం ఫీజుకింద చదరపు గజానికి ప్రకారం రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉండగా.. దాంతో పాటు అదనంగా గజానికి రూ.200ఇవ్వాలని సబ్‌రిజిస్ట్రార్ ఆయన్ను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గజానికి రూ.150 అదనంగా ఇచ్చేందుకు హరీష్ అంగీకరించాడు. కానీ అందుకు సబ్‌రిజిస్ట్రార్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు గజానికి రూ.200చొప్పున ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో గత్యంతర లేని పరిస్థితుల్లో బాధితుడు వరంగల్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం మరోసారి సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడిన హరీష్.. తాను గజానికి రూ.150 చొప్పున 128 గజాలకు రూ.19200 అదనంగా చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని, డబ్బు తెచ్చానని చెప్పగా.. ఆ నగదును డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకట్‌కు అందించాలని తస్లీమా సూచించారు. ఆమె చెప్పినట్టుగా నగదును ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, డేటాఎంట్రీ ఆపరేటర్ వెంకట్ అలియాస్ ఆలేటి వెంకటేశ్వర్లుకు ఇస్తుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి హరీష్ ఇచ్చిన రూ.19,200తో పాటు అంతకుముందు శుక్రవారం రోజంతా ఇతరుల నుంచి లంచాల రూపంలో వసూలు చేసిన (అన్‌అకౌంట్ మనీ) రూ.1.72 లక్షలను కూడా స్వాధీనం చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌తో పాటు ఆమెకు సహకరించిన వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. వారిని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈదాడుల్లో సీఐలు శ్యాంసుందర్, సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు. మొత్తంగా ఏసీబీ దాడుల్లో తస్లీమా పట్టుబటడం జిల్లా వ్యాప్తంగా, అధికార వర్గాల్లో తీవ్ర కలవరం రేపింది. అయితే తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో దంతాలపల్లి మండల కేంద్రంలో ఇటీవలే 128 గజాల ఇంటి స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ప్రభుత్వానికి చెల్లించే ఫీజుతో పాటు అదనంగా డబ్బులు అడగడంతో ఏసీబీని ఆశ్రయించాని హరీష్ తెలిపారు. మరెవరికి ఇలా జరుగవద్దనే ధైర్యం చేశానన్నారు.

**సామాజిక సేవా కార్యకర్తగా..**

కొన్నేళ్లుగా సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ములుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాలం నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విపత్కర సమయాల్లో గిరిజనులకు సాయమందిచడంలో ముందుండేవారన్న పేరుంది. కొవిడ్ విపత్కర సమయంలో ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి కొండలు, గుట్టలు దాటి గిరిజనగూడేల్లోకి వెళ్లి నిత్యావసరాల పంపిణీతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించడం, ఆ దృశ్యాలు సోషల్‌మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్లడంతో తస్లీమా అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇలా సామాజిక సేవా గుణం ఉన్న ఆమె లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

## మళ్లీ బీజేపీదే అధికారం

- మూడోసారి కూడా ఘన విజయం ఖాయం
- దేశాభివృద్ధికి పాటుపడుతున్న ప్రధాని మోదీ
- మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాం నాయక్



మాట్లాడుతున్న సీతారాం నాయక్

ములుగు, మార్చి22: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి మూడోసారి కూడా అధికారం చేపట్టడం ఖాయమని ఆ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహనరావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావుతో కలిసి ములుగు జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన సమయంలో అవినీతి లేకుండా పనిచేశానని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ గెలిపించుకుంటే ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభంజనంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కొట్టుకుపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణను దోపిడీ చేసిన వారిని మోదీ ప్రభుత్వం వదిలే ప్రసక్తే లేదని, దేశంలో కుంభకోణాల వెనుక కుటుంబ పార్టీలే ఉన్నాయని ఆరోపించారు. దేశాభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రధాని మోదీకి ప్రజలు అండగా ఉండాలని కోరారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం, నాయకులు అజ్మీరా ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

- మానుకోట ఎంపీగా బలరాం నాయక్‌ను గెలిపించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క

ఏటూరునాగారం, మార్చి 22: కాంగ్రెస్‌తో దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిపోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ఏటూరునాగారం మండలంలో బలరాం నాయక్‌తో కలిసి మంత్రి శుక్రవారం పర్యటించారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగిన శిఖర ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జాడి పుల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ములుగు నియోజకవర్గ ప్రజలు బలరాం నాయక్‌ను గెలిపించుకోవాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లా పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు. బలరాం నాయక్ మాట్లాడుతూ గతంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన తాను ములుగు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డానని అన్నారు. తనకు ఈసారి కూడా ఎంపీగా అవకాశం కల్పించి సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తాను



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సీతక్క

మిగతా 8వ పేజీలో..

## నీటి ఎద్దడిని నివారించాలి

- భూపాలపల్లి కలెక్టర్ భవేష్ మిశ్రా



భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 22: వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయన శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవిలో నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న బోర్లు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నీటి సమస్యలపై ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పైపులైన్ లీకేజీలను సరిచేసి నీటి వృథాను అరికట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు గ్రామాల్లోని నీటి ట్యాంకులను నెలలో మూడుసార్లు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం జరిగినప్పుడు తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్లకు ఎలాంటి డ్యామేజ్ జరగకుండా చూసుకోవాలన్నారు. రాబోయే మూడు నెలలు ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా కాకుండా చూడాలని అన్నారు. జిల్లాలోని బోర్‌వెల్స్, చేతి పంపులను మ్యాపింగ్ చేయాలన్నారు.జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ నయీంనగర్‌కు చెందిన సంద్ర దిలీప్ అనే యువకుడు (25) ఈ నెల 18న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా అదృశ్యమైపోయాడని హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేసే దిలీప్.. ఈ నెల 18న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఇళ్లలో వెతికినా సమాచారం లేకపోవడంతో దిలీప్ తల్లి శోభ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఐనవోలు, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పున్నేలు శివారు జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పంథిని గ్రామానికి చెందిన నస్కూరి వినోద్ ఐనవోలుకు వెళ్లి బైక్‌పై పంథినికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఏకశిల పాఠశాల సమీపంలో టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.



కటాక్షపూర్‌లోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

## చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, మార్చి22: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును సీపీ పరిశీలించారు. తనిఖీ సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సీపీతో ఆత్మకూరు సీఐ క్రాంతికుమార్ ఉన్నారు.

## ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 22: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించారు. తిరిగి మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు.

### వరంగల్ మార్కెట్లో తగ్గిన పంటల ధరలు

వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో వివిధ పంట సరకులకు గురువారంతో పోలిస్తే శుక్రవారం మరింత తగ్గాయి. పత్తి క్వింటాకు రూ.7,315 శుక్రవారం రూ. 7,250 పలికింది. సింగిల్‌పట్టి మిర్చి క్వింటాకు రూ.45,600 లకు రూ.42వేలు పలికింది. తేజా రూ.19,800లకు రూ.19,300, వండర్‌హాట్ రూ.15,500లకు రూ.15వేలు, యుఎస్ 341 రకం రూ.16,500లకు రూ.15వేలు ధర పలికింది. అలాగే, దీపిక రూ.14వేలు పలికింది. దేశీ రకం రూ.34వేలకు రూ.30వేలు, తాలు రూ.8వేలకు రూ.8,500 ధర పలికింది.

# అక్రమాలకు కేరాఫ్ కేయూ!

## ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ




(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తన చదువులమ్మ చెట్టు నీడలో ఎందరినో మహానుభావులుగా తీర్చిదిద్దిన కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ఠ దిగజారుతోంది. యూనివర్సిటీ నిర్వహణ వ్యవహారాల గురించి గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవటంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఫలితంగా అనేక అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. తాజా వెలుగులోకి వచ్చిన పలు అక్రమాలతో ఇదంతా వాస్తవమేనన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆన్సర్ షీట్ స్కానింగ్ టెండర్ల రద్దు, రీటెండర్ వ్యవహారం దుమారం రేపుతోంది. కాకతీయ యూనివర్సిటీలో 32పేజీలు ఉండే యూజీ, పీజీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను స్కానింగ్ చేయటం కోసం ఫిబ్రవరి 2వ తేదీన ఈ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. టెండర్ బిడ్ సమర్పించడానికి మార్చి6 వరకు గడువు విధించారు. ఇలా వచ్చిన దరఖాస్తుల టెక్నికల్ బిడ్‌ను మార్చి 7న, కమర్షియల్ బిడ్‌ను 13వ తేదీన ఓపెన్ చేయాల్సి ఉంది. ఈ స్కానింగ్ టెండర్‌కు మూడు కంపెనీలు బిడ్ దాఖలు చేయగా.. అందులో కోజిన్ లిమిటెడ్ కంపెనీ మిగతా రెండింటి కంటే తక్కువగా ఒక ఆన్సర్ షీట్ డిజిటలైజేషన్‌కు రూ.14.51కు కోట్‌చేసింది. నిబంధనల ప్రకారం టెండర్‌ను కోజిన్ కంపెనీకి ఇవ్వాల్సి ఉంది. కానీ, అనుహ్యంగా కేయూ వీసీ ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ ఈ నెల 16న రీటెండర్‌కు నోటిఫికేషన్ జారీ చేయటం వివాదాస్పదమైంది. పాత టెండర్‌ను ఎందుకు రద్దు చేశారో చెప్పకుండా రీ టెండర్ నోటిఫికేషన్ వేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన కంపెనీకి టెండర్ దక్కకపోవటంతోనే రద్దు నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం రూ.5లక్షల దాటే ఏ పనికైనా తప్పనిసరిగా టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో మూడేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా ఆన్సర్ షీట్ స్కానింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత టెండర్లపై దృష్టిపెట్టడంతో రూ.2కోట్లతో చేపట్టే ఆన్సర్ షీట్ల స్కానింగ్ పనులకు ఈసారి టెండర్లు పిలిచి, వాటిని అకారణంగా రద్దు చేసిన కేయూ అధికారుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ టెండర్ రద్దుపై పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదు చేయటం కలకలం రేపుతోంది.

### అధ్యాపకుల నియమాకంలో అక్రమాలే..

కేయూలో ఇటీవల నియమించిన అనుబంధ అధ్యాపకుల(అడ్జంట్ ఫ్యాకల్టీ)ను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం అడ్జంట్ ఫ్యాకల్టీ నియమకానికి ముందస్తుగా నోటిఫికేషన్ ఇవ్వాలని, వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధిపతులు పరిశీలించి రిజిస్ట్రార్‌కు పంపించాల్సి ఉంటుందని యూనివర్సిటీ అధ్యాపకులు పేర్కొంటున్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అధ్యాపకులను ఎంపిక చేసేందుకు ఐదుగురితో కూడిన సెలక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదనే విమర్శలున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12 మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16 మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 సెప్టెంబరులో ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో ఎలాంటి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకూడదని ఆదేశాలున్నా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకుండా నియామకాలు చేశారని, వీరి కి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మంది కి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయడం లేదని, క్లాసులు తీసుకోవటం లేదని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఫామ్-డి అనుమతిలో నిబంధలు బేఖాతరు

ఫార్మసీ కాలేజీలకు అనుమతుల్లోనూ కేయూ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేయూ పరిధిలో మొత్తం 24 ఫార్మసీ కాలేజీలుండగా వీటిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులున్నాయి. అయితే 12కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్-డి కోర్సు నిర్వహించే కాలేజీలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన 300 పడకల ఆస్పత్రులు అనుబంధంగా ఉండాలి. కానీ దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో.. కేర్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ, వాగ్దేవీ హనుమకొండ, సెయింట్ పీటర్, తాళ్ల పద్మావతి కాలేజీ, ఖమ్మం ఫార్మసీకాలేజీలు మాత్రమే 300 పడకల ఆస్పత్రులను అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారు. కేయూ అధికారుల తమకు అనుకూలమైన వారిని తనఖీలకు పంపించి, తప్పుడు నివేదికల ఆధారంగా ఆ కళాశాలలకు అనుమతులిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలతో కేయూ పరువు బజారుకెక్కింది. 2017లో పీహెచ్‌డీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు ఆరేళ్ల పాటు పట్టించుకోలే దు. విద్యార్థుల ఆందోళనలతో దిగివచ్చిన కేయూ అధికారు లు 2023లో అడ్మిషన్లకు షెడ్యూల్ ప్రకటించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో 75శాతం రెగ్యులర్ ప్రాతిపదికన, 25శాతం పార్ట్ టైం ప్రాతిపదికన కేటాయించారు. మే 27, 2022లో కేటగిరి-1 ఇంటర్వ్యూలు నిర్వహించి.. అదే ఏడాది మార్చి 21న కేటగిరి-2లో సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టు 29న ఫలితాలు వెల్లడించారు. అయితే ఇంటర్వ్యూలో అధికారులు నిబంధనలు పాటించలేదని, అవకతవకలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తూ గత సెప్టెంబరులో ఆందోళనకు దిగా రు. కేటగిరి-2 అడ్మిషన్లలో కొందరు ప్రొఫెసర్లు సీట్లు అమ్ముకున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగగా పదిమంది విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేసి ఇద్దరిని జైలుకు పంపించారు. దీనిపై విద్యార్థులు అప్పటి గవర్నర్ తమిళిసైను కూడా కలిసి పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఫిబ్రవరి 16న త్రిసభ్య కమిటీని వేసింది. కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు ఆ త్రిసభ్య కమిటీ సభ్యులు కేయూలో పర్యటించి వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు అధ్యాపకులు, విభాగాల అధిపతులు, విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. అయితే గత బుధవారం త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా అందులో ఏముందో యూనివర్సిటీ అధికారులు బయట పెట్టకపోడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కాగా, వీటితో పాటు కేయూలో ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పరిశోధనలు చేయకుండా రూ.20లక్షల నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ జరుగుతోంది. రిజిస్ట్రార్, వీసీ నియామకాలతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలపై వివాదం కొనసాగుతుండగా.. ఇప్పటికే ప్రభుత్వం యూనివర్సిటీపై దృష్టిసారించి ప్రత్యేక విచారణ కమిటీలు, విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించింది. కేయూలో జరుగుతున్న అవతవకలపై అకుట్ ఆధ్వర్యంలో అనేకమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. మొత్తం మీద రాష్ట్రంలో రెండో అతి పెద్ద యూనివర్సిటీగా ఉన్న కేయూలో కొంతకాలంగా వస్తున్న అక్రమాల ఆరోపణలు, విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనలతో ప్రతిష్ఠ మసకబారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## వరంగల్‌లో గడువు తీరిన ఔషధాల విక్రయం

వరంగల్ మెడికల్, మార్చి 22: రోగికి గడువు తీరిన ఔషధాలు విక్రయించిన ఘటనపై వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని శ్రీ సృష్టి హాస్పిటల్ వైద్యురాలు దొడ్డ సంధ్య దగ్గరకు లలిత అనే గర్భిణీ పరీక్ష నిమిత్తం ఈ నెల 18న వెళ్లింది. వైద్యురాలు గర్భిణీకి పరీక్ష నిర్వహించి పోల్‌విస్ట్-డీహెచ్‌ఏ మా త్రలు రాసింది. ఇదే హాస్పిటల్ ఆవరణలోని తిరుమల ఫార్మసీలో మందులు కొనుగోలు చేశారు. ఎక్స్‌పైరీ తేదీ దగ్గర కట్ చేసి నాలుగు షీట్స్ విక్రయించారని రోగి భర్త ఎం.మహేశ్ ఫిర్యాదు చేశారు. వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మందుల విక్రయాలపై డీఎంఈ ఆరా

వరంగల్ మెడికల్, మార్చి 22: ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు మందులను ప్రయివేట్ వ్యక్తులకు విక్రయించిన ఘటనపై వైద్య విద్య డైరెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఆర్‌ఈహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్‌రెడ్డి సెలవులో ఉండటంతో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో శుక్రవారం ఉదయం డాక్టర్ చంద్రశేఖర్ ఆర్‌ఈహెచ్‌ను సందర్శించారు. మందులు బయటికి తరలివెళ్లిన విషయాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను డీఎంఈకి పంపనున్నారు. కాగా, ఎఫ్‌ఐఆర్ కాపీ అందించిన వెంటనే ఫార్మసిస్టు తలకోటి నాగేందర్‌ను సస్పెండ్ చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

## ఏప్రిల్ 1 నుంచి దివ్యాంగుల ప్యాసింజర్ వాహనాల రాయితీ రద్దు

వరంగల్ చౌరస్తా, మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆదేశానుసారం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేయబడుతున్న టీ-ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ప్యాసింజర్ వాహనాలకు కల్పించే రాయితీ ఏప్రిల్ 1 నుంచి రద్దు చేయబడిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శుక్రవారం నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన రాయితీలు యథావిధిగా అమల్లో ఉంటాయన్నారు. రద్దు చేయబడిన లబ్ధిదారులు ఆ రాయితీని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పొందవచ్చని ఈ మార్పును లబ్ధిదారులు గమనించాలని నర్సింహమూర్తి తెలిపారు.

## టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, మార్చి22: గీసుగొండ మండలంలోని రెడ్డిపాలెం, హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్‌లో బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో రెడ్డిపాలెంలో రూ.61,210, ఎల్లాపూర్‌లో రూ.5100 అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధృవీకరించారు.

## అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### సీఎం రేవంత్ రెడ్డికి అర్చక ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి



సీఎంను కలిసి సమస్యలను నివేదిస్తున్న అర్చక ఉద్యోగుల జేఏసీ నాయకులు

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలన్నిటినీ పరిష్కరించాలని అర్చక ఉద్యోగుల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థించింది. శుక్రవారం అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో అర్చకులు సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసగృహంలో కలిశారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా జీవో నెంబరు 577 ప్రకారం అర్చక ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,627 మందికి వేతనాలు చెల్లించాల్సి ఉండగా, దేవాదాయ అధికారుల నిర్లక్ష్యంవల్ల ప్రస్తుతం మూడు వేల మందికి మాత్రమే వస్తున్నాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగతా వారికి కూడా వచ్చేట్టు తగిన చర్యలు తీసుకోవలసిందిగా వారు కోరారు. 121 జీవో తొలగించడంవల్ల పూర్తిస్థాయిలో అందరికీ గ్రాంట్ ఎయిడ్ ద్వారా వేతనాలు వస్తాయని తెలిపారు. రెండేళ్లుగా దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాలు లేవని తెలిపారు. 200మంది అర్చక ఉద్యోగుల పిల్లలను కారుణ్య నియామకాల ద్వారా నియమించాలని కోరారు. అర్చక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా అర్చక ఉద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రతీ అర్చక ఉద్యోగికి ఆరోగ్య బీమా వర్తింప చేయాలని సీఎంను అభ్యర్థించారు. రిటైరైన ఉద్యోగులకు రూ.10లక్షల చొప్పున గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, గ్రామీణప్రాంత ధూప, దీప, నైవేద్య అర్చకులకు ఉద్యోగభద్రత కల్పించాలని, వారి గౌరవ వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని, ధార్మిక భావన కలిగిన వారిని దేవాలయ ధర్మకర్తల మండలిలో నియమించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఓఎస్‌డీని పిలిచి అర్చక ఉద్యోగుల సమస్యలపై రెండు రోజుల్లో నివేదిక అందచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు క్రిష్ణమాచారి, పరాశరం రవీంద్రాచారి, అర్చక జేఏసీ కన్వీనర్ అగ్నిహోత్రం చంద్రశేఖర్ శర్మ, కర్మాఘాట్ దేవాలయం అర్చకులు అంబా ప్రసాద్ శర్మ, సంతోష్ కుమారాచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన శర్మ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ కేయూ రోడ్డులోని గోపాల్‌రావు బిల్డింగ్ ఏరియాలో ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనదారుడు యూ టర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొని గాయపడ్డ ఘటన ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికాస్‌నగర్‌కు చెందిన ఎల్లస్వామి డబ్బాల నుంచి రెడ్డికాలనీ వైపు వస్తుండగా గోపాల్‌రావు బిల్డింగ్ వద్ద కారు డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడి ఎడమ కాలు విరిగింది. బాధితుడి అల్లుడు దండు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మట్టి టిప్పర్ల పట్టివేత

ధర్మసాగర్, మార్చి 22: అక్రమంగా మట్టిని రవాణాచేస్తున్న టిప్పర్లను ఎస్సై నర్సింగరావు శుక్రవారం పట్టుకున్నారు. నష్కల్‌కు చెందిన కొతుల రాజు, యాకయ్యలు ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ శివారు గట్టుమల్లికార్జున దేవస్థానం నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి వద్దకు రాగానే పోలీసులు వాహనాలను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను పీఎస్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

## రైల్వే కో ఆప్షన్ మెంబర్‌గా రాఘవేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాఘవేందర్

కాజీపేట, మార్చి 22: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అనుబంధంగా నడుస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ల సర్వసభ్య సమావేశం శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగింది. కాజీపేట రైల్వేవిభాగంలో పనిచేస్తున్న దేవులపల్లి రాఘవేందర్‌ను కో ఆప్షన్ డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్ర సంఘం నాయకుల చేతుల మీదుగా రాఘవేందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్‌రావు, పిల్లలమర్రి రవీందర్, షేక్ ఖాజాబాబ, చినుకు స్వామిలకు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



# బాబోయ్.. ఎండలు!

● వడగాలులతో జాగ్రత్త ● వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం ● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

వరంగల్ మెడికల్, మార్చి 22: ఎండలు బాబోయ్ ఎండలు.. అంటూ జనం బేజారవుతున్నారు. మార్చి మొదటివారం నుంచే మండే ఎండలు ముంచుకొచ్చాయి. ఇక ఏప్రిల్, ఇక మే నెలను తలుచుకుంటే జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది ఎండలు దంచనున్నాయని ముందే హెచ్చరించింది. కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు భానుడి ప్రతాపానికి విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఇప్పటికే మంచాన పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి తమను తాము రక్షించుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వర్గాలు చెబుతున్నాయి.

### వడదెబ్బ ఎలా సోకుతుంది?

ఎండ తీవ్ర ఉన్నప్పుడు మనిషి మెదడులో ఉన్న ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల, ఎక్కువసేపు ఎండలో ప్రయాణం చేసిన పని చేసిన వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత 108 ఫారన్‌హీట్ నుంచి 110 ఫారన్‌హీట్‌ల వరకు పెరుగుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

### వడదెబ్బ లక్షణాలు

శరీరం నీరసించి పోవడం, విపరీతమైన దాహం, మూత్ర విసర్జనలో మంట తీవ్ర, చర్మం ఎర్రగా మారి వేడిగా ఉండడం, నీళ్ల విరేచనాలు, తల తిరగడం, మగతగా ఉండి అపస్మారక స్థితికి చేరడం. వాంతులు చేసుకోవడం.

### వెంటనే అందించాల్సినవి

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ లేదా గాలి ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఆ తరువాత శరీరంపై ఉన్న దుస్తులు తొలగించి ఐస్ ముక్కలతో చల్లని నీటితో కానీ శరీరం అంతా తుడవాలి. కొబ్బరినీరు, నిమ్మరసం, మజ్జిగ ద్రావణాన్ని తొలగించాలి. అయినా రోగి కోలుకోకపోతే వెంటనే ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు.



### ముందస్తు చర్యలు చేపట్టాం..

#### డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు



ఎండలు ముదురుతున్న దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, ఆరోగ్య ఉప కేంద్రాల, తన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని అలర్ట్ చేశాం. క్షేత్రస్థాయిలో వడదెబ్బ సోకిన వారి వివరాలు సేకరించేందుకు యంత్రాంగం పూర్తి కార్యాచరణతో ఉంది. పిల్లలు, వృద్ధులు తొందరగా వడదెబ్బ సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్య శాఖ కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెలైన్ బాటిల్స్ సరిపడా నిల్వలు ఉన్నాయి. త్వరలో ప్రత్యేక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తాం. 108, 104 సేవలు కూడా ముమ్మరం చేస్తాం, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

## ఎన్నికల నిర్వహణకు సహకరించండి

● రాజకీయ నేతలతో కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మార్చి 22: పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్‌లో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె శుక్రవారం సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, 29వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని వివరించారు. షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, కోడ్‌ను పకడ్బందీగా అమలయ్యేలా సహకరించాలని కోరారు. కోడ్ ఉల్లంఘనలపై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయొచ్చని, టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని అన్నారు. రాజకీయపార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్‌విండో ద్వారా అనుమతులు ఇస్తామని, సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రచారం పాఠశాలల్లో నిర్వహించకూడదన్నారు.ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురిచేయడం, తప్పుడు ప్రచారాలు చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో నమోదు చేయాలని అధికారునుల ఆదేశించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనత సమస్యను జయించాలి

చిట్యాల, మార్చి 22: మహిళలు బలవర్ధక ఆహారాన్ని తీసుకుని రక్తహీనత, పోషకాహార లోపాన్ని జయించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని నైన్‌పాక ఉన్నత పాఠశాలలో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని, పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించా లని అన్నారు. చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాలింతలకు సీమంతం, చిన్నారులకు అక్షరభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. సీడీపీవో అవంతి, సూపర్‌వైజర్ జయప్రద, పాఠశాల హెచ్‌ఎం ఊర్మిళారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

మహదేవపూర్, మార్చి 22: మహదేవపూర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ శశిధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు లారీలు, రెండు బొలెరో వాహనాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీ చేశారు. దీంతో రెండు వాహనాల్లో 700 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందంలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, సీఐలు ప్రసాద్, లక్ష్మయ్య, ఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

# హామీలన్నీ నెరవేరుస్తున్నాం..

**పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క**


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కన్నాయిగూడెం, మార్చి 22 : ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని ముప్పనపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి.అఫ్సర్ పాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి కాంగ్రెస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాల హామీలను ఇచ్చామని, వాటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు వడీ లేని రుణాలు అందించి స్వావలంనకు కృషి చేస్తున్నామన్నారు. పాఠశాలల్లో అమ్మ కమిటీలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. రైతులకు త్వరలోనే రుణమాఫీ చేస్తామన్నారు. రైతుబంధు నిధులు కొంత మందికి వచ్చాయని, మిగిలిన వారందరికీ ఇస్తామని అన్నారు. మండలంలో మండల సమాఖ్య బిల్డింగు, ఎంపీడీవో భవన్‌తోపాటు తుపాకుల గూడెం-ఏటూరునాగారం రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నిల్లో ఆదరించినట్టే రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మధు, ఎంపీపీ సమ్మక్క, వైస్ ఎంపీపీ భాస్కర్, ఎంపీటీసీ శైలజ, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం

5వ పేజీ తరువాయి

విజయం సాధిస్తే ముఖ్యంగా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. అయ్యుబ్ ఖాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవి చందర్, బ్లాక్ యూత్ అధ్యక్షుడు వసంత శ్రీనివాస్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి దేవేందర్, టౌన్ అధ్యక్షుడు సరికొప్పుల శ్రీనివాస్, టౌన్ ఉపాధ్యక్షుడు రాంబాబు, యూత్ మండల అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మంగపేట మార్చి 22 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగపేట మండలంలోని తొండ్యాల అంగన్‌వాడీ సెంటర్ 2లో శుక్రవారం అవగహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తహసీల్దార్ వీరస్వామి, ఈడీ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీకాంతం, సుజాత, ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

## నిఘా వర్గాల ఆరా!

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 22: నిరుద్యోగుల నుంచి ఉద్యోగాల పేరిట ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు అక్రమ వసూళ్లు చేశాయని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం సృష్టించింది. ఈకథనంతో ఔట్‌సోర్సింగ్ సంస్థల నిర్వాహకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్టు తెలుస్తోంది.మరోవైపు ఈ వ్యవహా రాన్ని ఎస్పీ కిరణ్ ఖరే సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. ఇంటెలిజెన్స్, ఎస్పీ బృందాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

## పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

**చికిత్స పొందుతూ మృతి**

**అధ్యాపకుల వేధింపులే కారణమని ఆరోపణ**


వైష్ణవి (ఫైల్)

చిట్యాల, మార్చి 22: పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థిని భీముని వైష్ణవి (19) గురువారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కాల్వపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు-కోమల దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల తన స్నేహితుడైన రాహుల్ పుట్టినరోజు సందర్భంగా తన క్లాస్‌రూంలోనే తన స్నేహితుల సమక్షంలోనే వైష్ణవి అతడితో కేక్ కట్ చేయించింది. ఈ విషయం తెలుసుకున్న కళాశాల హెచ్‌వోడీ, అధ్యాపకులు వైష్ణవిని మందలించారు. ఆ తర్వాత ఈనెల 17న కళాశాల హెచ్‌వోడీ వైష్ణవి తండ్రికి ఫోన్ చేసి కూతురిని ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో ఆయన హనుమకొండలో ఉంటున్న తన మరో కుమార్తె కీర్తనకు చెప్పడంతో కళాశాలకు వెళ్లిన కీర్తన తన సోదరి వైష్ణవిని తీసుకొని కళాశాల నుంచి బయల్దేరింది. అయితే అప్పటికే కొంత అనారోగ్యంతో బాధపడుతున్న వైష్ణవిని కీర్తన అక్కడే ఓ ఆస్పత్రిలో చూపించింది. అనంతరం వైష్ణవి కాల్వపల్లికి బస్సులో బయల్దేరగా.. కీర్తన హనుమకొండ వెళ్లిపోయింది. కానీ మార్గమధ్యలోని టేకుమట్లలో దిగిన వైష్ణవి పురుగుల మందు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లింది. ఆ తర్వాత ఇంట్లో ఎవరూ చూడని సమయంలో ఆ పురుగులమందు తాగి అపస్మారస్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం పరకాలలోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వైష్ణవి గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. వైష్ణవి మృతి విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఆమె నివాసానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. అయితే కళాశాల హెచ్‌వోడీ, అధ్యాపకులు మందలించడం వల్లే వైష్ణవి ఆత్మహత్య చేసుకుందని, వారిపై చర్యలు తీసుకోవాలని వైష్ణవి కుటుంబసభ్యులు, తోటి విద్యార్థులు డిమాండ్ చేశారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాడ్వాయి, మార్చి22: మండలంలో తాగునీటి సమ స్యను పరిష్కరించాలని సంబం ధిత అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండల కేంద్రంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి ఉన్నతాధి కారులతో ఆమె శుక్రవారం సమావేశమయ్యారు. తాగునీటి సరాఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా చేతిపంపులు, నల్లా కనెక్షన్లు, మిషన్‌భగీరథ పైపులైన్లు, వాటర్ ట్యాంకులు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతుకుగురైన వాటిని రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. వేసవిలో ఏ ప్రాంతానికీ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మండలకేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. బాలికలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం మండలంలోని లింగాల గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి తాగునీటి సమస్యపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి వారి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ, మండల స్పెషల్ ఆఫీసర్ అల్లం అప్పయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### నీటి ఎద్దడిని నివారించాలి : డీఆర్డీవో

గణపురం : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని డీఆర్డీవో నరేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో నీటి కొరత లేకుండా చేతి పంపులు, బోర్ మోటార్ల సమాస్యలు ఉంటే ముందస్తుగా మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అడిగిన వారికి జాబ్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

వెంకటాపూర్ (రామప్ప): తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వెంకటాపూర్ తహసీల్దార్ సదానందం అన్నారు. వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామాన్ని ఆయన సందర్శించారు. తాగునీటి సమస్యపై ఆరా తీశారు. గ్రామాల్లోని చేతిపంపులను, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను, ఓపెన్ వెల్స్, బోరుబావులను పరిశీలించారు. తాగునీటి సమస్యలపై గ్రాస్థులను, పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలసుకున్నారు. కొన్ని చేతిపంపులు మరమ్మతులకు గురికాగా వాటిని వెంటనే సరిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అనంతరం పాటంపేటలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు.

## అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు

మల్హర్, మార్చి 22: మండలంలోని కొయ్యూర్‌లో ఎంపీ ఎన్నికల నేపథ్యంలో అంతర్ జిల్లా చెక్‌పోస్టును శుక్రవారం కొయ్యూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద 24 గంటల పాటు అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. నగదు, మద్యం తదితర వస్తువుల రవాణాపై నిఘా పెట్టారు.

## కరెంటు ఉచ్చులు పెడితే కఠిన చర్యలు

గోవిందరావుపేట, మార్చి 22: గ్రామాల్లోని రైతులు పంట పొలాల వద్ద కరెంటు తీగలు, ఉచ్చులు పెడితే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని రంగాపూర్ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొందరు రైతులు తమ పంట పొలాలకు రక్షణ, వన్యప్రాణులను వేటాడేందుకు కరెంటు తీగలు, ఉచ్చులు అమరుస్తున్నారని సమాచారం అందిందని అన్నారు. వీటితో అమాయకుల ప్రాణాలు బలి అవుతున్నాయని అన్నారు. ఇ ఎవరైనా కరెంటు తీగలు, ఉచ్చులు ఏర్పాటు చేస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

## ఇసుక లారీ పట్టివేత

కాటారం, మార్చి22: మండలంలోని మద్దులపల్లి చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం ఉదయం పోలీసులకు ఇసుక లారీని పట్టుబడింది. కాటారం ఎస్సై అభినవ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. గంగారం క్రాస్ రోడ్డు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లారీలో ఇసుకను హన్మకొండకు తరలిస్తుండగా లారీని పట్టుకుని సీజ్ చేశామని సీఐ నాగార్జున రావు తెలిపారు. లారీ యజమాని విక్రంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మొగుళ్లపల్లి, మార్చి 22: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొగుళ్లపల్లి సెక్టార్ పరిధిలోని మేదరమెట్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాన, అక్షరాభ్యాసం జరిగింది. ఈసందర్భంగా రజిత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

**భూపాలపల్లి డీఆర్డీవో నరేష్**


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో

చిట్యాల, మార్చి 22: వ్యవసాయ పనులు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియో గం చేసుకోవాలని డీఆర్డీవో నరేష్ కోరారు. మండల కేంద్రంలో కాల్వ పూడికతీత పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని పూర్తి చేసి రోజువారీ కూలి రూ. 272 మొత్తాన్ని పొందాలన్నారు. జాబ్‌కార్డు కలిగిన త్రి కుటుంబానికీ 100 రోజులు పని దినాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రామయ్య, ఎన్‌ఎంఎంఎస్ మేట్ షఫీ, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బీజేపీని మళ్లీ అధికారంలోకి తేవాలి

**బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహనరావు**


రామప్ప ఆలయంలో బీజేపీ నాయకులు

వెంకటాపూర్ (రామప్ప), మార్చి 22 : దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే బీజేపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహనరావు అన్నారు. పాలంపేటలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయాన్ని బీజేపీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడైన సీతరాంనాయక్ ప్రాతినిధ్యం పార్లమెంటులో అవసరమన్నారు. ప్రపంచం మొత్తం భారత దేశం వైపు చేస్తోందని, మోదీ సుపరిపాలన వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. దేశం మరింత సుస్థిరపడాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఉపాధ్యక్షుడు భూక్య జవహర్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ములుగు మహిళా విభాగం ఇన్‌చార్జి అజ్మీరా కృష్ణవేణి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

కాటారం, మార్చి 22: మండలం లోని గంగారం, గట్లకుంట గ్రామాల పరిధిలో శుక్రవారం ఎక్సైజ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా గుడుం బా స్థావరాలపై దాడులు నిర్వహిం చారు. కాటారం ఎక్సైజ్ సీఐ నరేం దర్, సివిల్ ఎస్సై అభినవ్, ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఇళ్లు, పొలాల గట్ల పక్కన తనిఖీలు చేశారు. గుడుంబా తయారీకి పులియబెట్టిన సుమారు 600 లీటర్లకు పైగా బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 20లీటర్ల గుడుం బాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబాను తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నా మని ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపా రు. ఇందులో ఒకరిని బైండోవర్ చేయగా అతడిపై బ్రీచ్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ,

## ప్రాణం తీసిన సరదా

**క్వారీ నీటికుంటలో పడి టెన్త్ విద్యార్థి మృతి**


శ్రీకాంత్ (ఫైల్)

కాజీపేట, మార్చి 22: తోటి విద్యార్థులు ఈతకు వెళ్తుండడంతో వారితో పాటు వెళ్లిన ఓ విద్యార్థి క్వారీ కుంటలో పడి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా చిల్పూర్ మండలం గొర్లమేడు గ్రామానికి చెందిన పోతనవేణి రాజాబాబు - మమత దంపతులకు కూతురు శిరీష, కుమారుడు పి.శ్రీకాంత్ (15) ఇద్దరు పిల్లలు, రాజబాబు మమత దంపతులు కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. కూతురు శిరీష ఇంటర్‌పూర్తి కాగా, కుమారుడు పి.శ్రీకాంత్ కాజీపేట విద్యానగర్ బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. శుక్రవారం పరీక్ష లేకపోవడంతో తోటి విద్యార్థులు ఏడుగురితో కలిసి సమీపంలోని లోతైన క్వారీ గుంతల్లో ఈతకు వెళ్లారు. శ్రీకాంత్‌తోపాటు మరో ముగ్గురికి ఈత రాకపోవడంతో ఒక గుండుమీద కూర్చుని బట్టలు విప్పి చేతితో నీళ్లు పోసుకుంటున్నారు. మిగతా ముగ్గురు గుంతలో ఈతకొడుతున్నారు. శ్రీకాంత్ నీళ్లు పోసుకుంటున్న క్రమంలో బండ జారడంతో నీటిలోకి మునిగాడు. దీంతో శ్రీకాంత్ నీటిలో మునిగి మృతిచెందాడు. తీవ్ర భయభ్రాంతులకు గురైన తోటి విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తహసీల్దార్ బావుసింగ్, హాస్టల్ సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. ఫైర్‌సిబ్బందిని పిలిపించి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. అప్పటి వరకు తమతోనే కలిసి ఉన్న శ్రీకాంత్ మృతిచెందడంతో తోటి విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. హాస్టల్ వార్డెన్‌కు తెలియకుండా విద్యార్థులు బయటికి ఎలా వెళ్లారనే దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## పీఏసీఎస్ అవిశ్వాసానికి లైన్‌క్లియర్!

కాటారం, మార్చి 22: గారెపల్లి(కే)ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసానికి లైన్‌క్లియర్ అయినట్లు సమాచారం. ఈ నెల 11న అవిశ్వాసం తీర్మానం కోసం డీసీవో పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయడానికి ఆదేశాలిచ్చింది. దీనిపై పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయగా సమావేశం ఏర్పాటును రద్దు చేస్తూ కోర్టు ఇంటీరియం సస్పెన్షన్ ఉత్తర్వులిచ్చింది. దీనిపై కొందరు డైరెక్టర్లతో పాటు సహకారశాఖ అధికారులు హైకోర్టులో ఈ నెల 20న గత ఉత్తర్వులను సవరిం చాలని కోరారు. దీంతో హైకోర్టు ఆవిశ్వాస తీర్మానం సమావేశం నిర్వహించుకోవచ్చని, తుది ఫలితాలు మాత్రం వెల్లడించొద్దంటూ ఏప్రిల్ 24కు కేసు వాయిదా వేసిందని పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

# మిర్చి రైతుల ఆందోళన


పేరూరులో ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

వాజేడు, మార్చి 22: మండల పరిధిలోని పేరూరులో మిర్చి రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఓ బహుళజాతి కంపెనీ ద్వారా ఒప్పంద వ్యవసాయం చేస్తున్న మిర్చి రైతులు తమ ఉత్పత్తిని ఆ సంస్థ కొనుగోలు చేయటం లేదని నిరసనకు దిగారు. గతంలో తొక్కిన మిర్చి బస్తాల లోడింగ్ కోసం వచ్చిన లారీల వద్ద ధర్నా నిర్వహించారు. పేరూరు, ధర్మవరం, చంద్రుపట్లకు చెందిన సుమారు వంద మంది రైతులు ఈ ఏడాది 500 ఎకరాలకు పైగా ఒప్పంద మిర్చి వ్యవసాయంను సాగు చేశారు. ఈ క్రమంలో కొంత మంది రైతుల పండించిన పంటనే కొనుగోలు చేస్తామని మిగిలిన వారి పంటను తీసుకోబోమని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి పంటను కొనుగోలు చేస్తేనే లారీలను పంపిస్తామని భీష్మించుకున్నారు. ఒప్పంద సాగు కింద క్వింటాకు రూ. 20వేలకు పైగా ధరను ఇస్తున్నఆ సంస్థ ఇప్పుడు చేతులు ఎత్తేసిందని, కొంత మంది వద్దనే కొనుగోలు చేస్తామని చెప్పడంతో తామంతా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆ కంపెనీ ప్రతినిధులు రైతులతో మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తమ సమస్యను పరిష్కరించేంత వరకు లారీలను పంపించేది లేదని రైతులు అల్టిమేటం జారీ చేయటంతో చేసేదేమీ లేక కంపెనీ ప్రతినిధులు అక్కడ నుంచి వెనుతిరిగారు. కంపెనీ పై స్థాయి ప్రతినిధులకు సమాచారం అందించారు. ఆ ప్రతినిధుల మాటను సైతం రైతులు వినకపోవడంతో లోడింగ్ నిలిచిపోయింది. దీనిపె కలెక్టరు, వ్యవసాయశాఖ అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

గోవిందరావుపేట, మార్చి 22: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పస్రాలో సెయింట్ మేరీస్ పాఠశాలలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. స్థానిక ఎస్సై కమలాకర్ ప్రారంభించి రక్తదానం చేయగా యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహావీరుడు భగత్‌సింగ్ అని, ఆయన వర్ధంతి రోజున రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నేటి యువకులు, విద్యార్థులు దేశాభివృద్ధి కోసం పాటుపడాలని, అసాంఘికశక్తులకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పిట్టల అరుణ్‌కుమార్, బ్రహ్మచారి, కొమ్ము రాజు, చల్ల రాజు, అరవింద్ శ్రావణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు జీవన్, ఉపేంద్రచారి, విజయ్, కొండయ్య, శేఖర్, సువర్ణ, అచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.